క్లుప్తంగా

సీసీ రోడ్లకు క్యూరింగ్ ఏది?



ఏటూరునాగారం: మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఏటూరునాగారంలో రూ.3 కోట్లతో ఎన్ఆర్ఈజీఎస్ కింద సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. స్థానిక సర్పంచ్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు సిమెంట్ రోడ్లను నిర్మిస్తున్నారు. కానీ నిర్మించిన రోడ్లకు క్యూరింగ్ చేయటం లేదని స్థానికులు వాపోతున్నారు. నీటితో ఎంత క్యూరింగ్ చేస్తే అంత పటిష్టంగా ఉంటుదని అధికారులు సైతం సిమెంట్ రోడ్ల నాణ్యత, క్యూరింగ్ విషయంపై పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. క్యూరింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్‌కు అంతరాయం కలిగిస్తే కేసు



మహాముత్తారం: గ్రామాల్లో కొంత మంది వజినేపల్లి నుంచి ములుగుపల్లి, పోలారం వెళ్లే వాగు పొడవున ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లకు గుర్తు తెలియని వ్యక్తులు కరెంటు తీగలు వేసి విద్యుత్‌కు అంతరాయం కలిగిస్తున్నారని తమకు సమాచారం అందిందని ఎస్సై సుధాకర్ అన్నారు. అలాంటి వారిని గుర్తించి చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని అన్నారు. కమ్యూనిటీ ప్రోగ్రాంలో భాగంగా గురువారం మహాముత్తారం, వజినేపల్లి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. వాగుపొడవున విద్యుత్ వైర్లువేసి కరెంటుకు అంతరాయం కలిగిస్తున్న వారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా గ్రామంలో గుడుంబా, గుట్క వంటి మత్తుప దార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మంజూల, సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



మహాముత్తారం: మండలంలోని రేగులగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అదే విధంగా పిల్లలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని మెనుప్రకారం అందించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

పోచమ్మ బోనాలు

టేకుమట్ల: మండలంలోని రాఘవరెడ్డిపేటలో గురువారం పోచమ్మతల్లి బోనాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పోచమ్మతల్లికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలతో ఆలయ ప్రాంగణం నిండుకుని పండగ వాతావరణం చోటు చేసుకుంది.

నేడు రేణుక ఎల్లమ్మ ఉత్సవాలు..

రాఘవరెడ్డిపేటలోని నేడు (శుక్రవారం) శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి ఉత్సవాలు కొనసాగనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు ఆలయాన్ని సిద్ధం చేసి, భక్తులకు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా గుట్ట ముసలమ్మ జాతర



వనదేవతను తీసుకొస్తున్న గిరిజన పూజారులు



ఎదుర్కోలు నిర్వహిస్తున్న గిరిజన పూజారులు, వడ్డెలు

మంగపేట: మండలంలోని నిమ్మగూడెం పంచాయతీ పరిధిలోని తిమ్మాపురంలో గుట్టముసలమ్మ జాతరను ఆదివాసీ గిరిజన సాంస్కృతి, సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. ఈ నెల 14న మండమెలిగే కార్యక్రమంతో ప్రారంభమైన జాతర రెండో రోజు బుధవారం పొద్దులుగట్టు నుంచి ముసలమ్మ అమవారిని ఆలయానికి చేర్చారు. ముసలమ్మగుడి దేవర బాల కొమరం రామయ్య ఆధ్వర్యంలో, ఆదివాసీ గిరిజన పూజారులు, వడ్డెలు గ్రామ పెద్దలు గురువారం గుట్ట నుంచి వనదేవతను తీసుకువచ్చి ఆలయంలో కొలువుదీరిన ముసలమ్మకు డోలి మోతలు, సన్నాయి వాయిద్యాల నడుమ ఎదుర్కోలు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివాసీ గిరిజనుల ఇలవేల్పులు అయిన ముసలమ్మ, వనదేవతలను ఏటూరునాగారం ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొమరం నర్సయ్య దర్శించుకుని ముసలమ్మ ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులు జరపుకునే జాతరలను గొలుసుకట్టు జాతరలుగా నిర్వహించాలన్నారు. ఆదివాసీ గిరిజన సాంస్కృతి, సాంప్రదాయాలతో నిర్వహించే పిల్ల జాతరలపై ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. గొలుసుకట్టు జాతరలుగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించి ఆదివాసీల సాంప్రదాయాలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొమరం చిన్న సమ్మయ్య, నర్సింగరావు, రేష నర్సింహారావు, మాజీ సర్పంచ్ కొమరం నర్సింహారావు, మాజీ ఎంపీటీసీ కొమరం సారయ్య, బాలయ్య, భిక్షపతి, రవికుమార్, మహిపాల్, మధు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించాలి



పాదయాత్రలో మాట్లాడుతున్న సతీష్

ములుగు రూరల్(గోవింద్‌నాయక్): పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బర్రి సతీష్ మాదిగ డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర 11 రోజు గురువారం గోవిందరావుపేట పస్రాకు చేరుకుంది. దీంతో మాదిగలు పాదయాత్రకు మద్దతు తెలిపారు. అనంతరం కొమురంభీం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు బీజేపీ ప్రభుత్వం మద్దతు తెలిపి దేశంలో అధికారంలో వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ సంవత్సరాలు గడిచిన పట్టించుకోవడం లేదని అన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌లు అమలు చేయకపోవడంతో విద్యా, ఉద్యోగ రంగాలలో మాదిగలు అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా మాదిగలు ఉన్నారని వచ్చే ఎన్నికల్లో బీజేపీని భూస్థాపితం చేసేందుకు మాదిగలు కలిసి రావాలని అన్నారు. ఏప్రిల్ 14వ తేదీనజరిగే ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఇరుగు పైడి మాదిగ, రాష్ట్ర నాయకుడు నెమలి నర్సయ్య, మడిపెల్లి శ్యాంబాబు, జిల్లా కన్వీనర్ కరుణాకర్, ముఖేష్, వాసంపల్లి చైతన్య, బలరాం, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పరపతి సంఘాలతో ఆర్థికంగా ఎదగాలి

ములుగు: మున్నూరుకాపు మహిళలు పరపతి సంఘాలలో చేరి ఆర్థికంగా ఎదగాలని మున్నూరుకాపు రాష్ట్ర మహిళా పరస్పర సహకార పొదుపు, పరపతి సంఘం సీఈఓ సర్దార్ పుటం పురుషోత్తంరావు పటేల్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం కో ఆర్డినేటర్ పిట్టల మధుసూదన్ అధ్యక్షతన జరగగా పురుషోత్తంరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా మేలుకో–స్వావలంబన సాధించుకో అనే నినాదంతో మహిళా మాక్ సొసైటీలను ఏర్పాటు చేశామని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సకినాల భవాని, నియోజకవర్గ నాయకుడు చింతనిప్పుల భిక్షపతి, మండల కోఆర్డినేటర్ సిరికొండ బలరాం, డైరెక్టర్ గండ్రత్ జయకర్, ఎడ్ల సంపత్, అనుముల సురేష్, గండు రవీందర్, గాదె రాజు, ప్రభాకర్, రాజు, తోట అశోక్, గాదె ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్దార్ పురుషోత్తం రావు పటేల్

సెకండియర్ పరీక్షలు షురూ..

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గిరిజన గురుకుల బాలికల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం మొదలయ్యాయి. సంబంధిత కళాశాలల ఇన్‌చార్జ్‌లు పరీక్ష పత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బందోబస్తు మధ్య పరీక్ష కేంద్రాలకు తీసుకువచ్చారు. ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 207 మందిని అలాట్ చేయగా 205 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ భగవద్గీత తెలిపారు. అలాగే గిరిజన గురుకుల కళాశాలలో 110 మందిని 108 హాజరైనట్లు ప్రిన్సిపాల్ వసుందర తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సెకండ్ ఎస్సై ఇంద్రయ్య బందోబస్తు నిర్వహించారు.

సెకండియర్ పరీక్షకు నలుగురు గైర్హాజరు

మంగపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఇంటర్ సెంకండియర్ మొదటి రోజు పరీక్షకు నలుగురు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. 138 మంది విద్యార్థులకు 134 మంది హాజరైనట్లు తెలిపారు.

వాజేడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ రెండవ సంవత్సరం పరీక్షలకు 11 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారు. జనరల్ పరీక్షల్లో 112 మందికి గాను 109 మంది, ఒకేషనల్ కోర్స్‌లో 47 మందికి గాను 39 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని వాజేడు తహసీల్దార్ గూడురు లక్ష్మణ్ గురువారం తనిఖీ చేశారు.



ఏటూరునాగారం: పరీక్ష రాసేందుకు వస్తున్న విద్యార్థులు



ఏటూరునాగారం: చంటిబిడ్డను ఎత్తుకొని పరీక్షకు హాజరైన మహిళ



మంగపేట: పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు



వాజేడు: పరీక్షలను పరిశీలిస్తున్న తహసీల్దార్



పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరం, చంటిపాపను ఆడిస్తున్న బాలుడు

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ములుగు రూరల్: రాష్ట్ర ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని రాంచంద్రాపూర్‌లో శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అష్టమాలిక్ ప్రభు చరణ్, క్యాంపు కోఆర్డినేటర్ భూపాల్‌రెడ్డి, డీఈఓ నిర్మల, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

మహదేవపూర్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మమత అందించారు. మహదేవ పూర్ గ్రామానికి చెందిన ఒడేటి మల్లారెడ్డికి రూ.1,25000, బోమ్మపూర్ గ్రామానికి చెందిన వెంకటికి రూ.48,000, విజయకు రూ.14,000, ఎడపల్లీ గ్రామానికి చెందిన తిరుమలకు రూ.9,000ల విలువైన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చెర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ బండం పుష్పలత, సర్పంచ్‌లు శ్రీపతి బాపు, ఓడేటి పద్మ, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ మహిళ ఇన్‌చార్జ్ కేదారి గీత, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ కుంభం పద్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మహేష్, బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు అలీం ఖాన్, నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి మెరుగు శేఖర్, మండల ఉపాధ్యక్షుడు లింగాల రామయ్య, మహిళ అధ్యక్షురాలు ఓడేటి స్వప్న, నాయకులు అన్కరి ప్రకాశ్, జక్కయ్య, బాపూరావు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న నాయకులు

నిబంధన తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శివకేశవ

ఏటూరునాగారం: ఇంటర్మీడియట్ ఫైనల్ ఎగ్జామ్స్ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కొన్ని ఏళ్లుగా ఒక నిమిషం ఆలస్యమైతే పరీక్షకు హాజరు కానివ్వడం లేదని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే నిబంధనను తొలగించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ నాయకుడు కోయిల శివకేశవ అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ఎస్ఎఫ్ఐ నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతమైన మారుమూల గ్రామాల నుంచి రవాణా సౌకర్యం లేని ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఎలాంటి నిబంధనలు లేకుండా చూడాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు స్వామి, రవితేజ, హనుమంతు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు డిపోకు సహకరించాలి

ఏటూరునాగారం: ఆర్టీసీ బస్సు డిపో, రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ ఎంపీపీ జాడి రామరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ బస్సు డిపో విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఏటూరు నాగారం వచ్చినప్పుడు ఎవరు కూడా ఏటూరు నాగారంలో కావాలని అడగలేదని, ఇప్పుడు అధికారులు, మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకుల వల్లనే బస్సు డిపో ఏర్పాటు కావడం లేదన్నారు. చందా జ్యోతి, గండెపల్లి సత్యం, ఈక మహాలక్ష్మి, కర్నె సంపత్, చక్రి, సూర్యప్రకాష్, జనార్ధన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాడి రామరాజు

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల(రేగొండ): కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రేగొండ మండలంలోని గోరికొత్తపల్లి, నిజాంపల్లి, గాంధీనగర్, కొత్తపల్లి, కోనరావుపేట, వెంకటేశ్వర్లపల్లి, సుల్తాన్‌పూర్, జంషేడ్‌బేగ్‌పేట్‌లో మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య ఆధ్వర్యంలో గురువారం హాథ్ సే హాథ్ జోడో యాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. అనంతరం సత్యనారాయణరావు మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగుల, రైతు ఆత్మహత్యలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.500లకే వంట గ్యాస్, సొంతింటి నిర్మాణానికి రూ.5లక్షల నగదు అందిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గూటోజు కిష్టయ్య, కనకం రమేష్, భువనసుందర్, పత్తి తిరుపతి, బానోతు రవీందర్, కిరణ్, వీరేందర్, గండి తిరుపతి పాల్గొన్నారు.

నర్సరీ పరిశీలన

మహదేవపూర్: మండలంలోని బొమ్మపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీని, బృహత్‌పల్లె ప్రకృతి వనం పనులను ఎంపీడీఓ రవీంద్రనాథ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో మొక్కల పెంపకం, షేడ్ నెట్ ఏర్పాటుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున నర్సరీలో పెంచే మొక్కలకు ఉదయం, సాయంత్రం వేళలో వన సేవక్ ద్వారా తప్పనిసరిగా రెండు మార్లు నీటిని పట్టించాలన్నారు. అంతేకాకుండా బృహత్ పల్లె ప్రకృతిలో నాటిన మొక్కలు పెరగడంపై గ్రామపంచాయతీ సర్పంచ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ రమేష్, బొమ్మపూర్ సర్పంచ్ పద్మా రవీందర్ ఉన్నారు.

యాత్రను విజయవంతం చేయండి

వాజేడు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన చైతన్య బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం నియోజకవర్గ కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం వాజేడు మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 17 వరంగల్‌లో ప్రారంభమై 29న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభతో జన చైతన్య బస్సు యాత్ర ముగుస్తుందని తెలిపారు. ఈ నెల 19న వాజేడులోని కొమరం భీం సెంటర్లో బహిరంగ సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ యాత్రలో సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, మాజీ శాసన సభ్యులు జూల కంటి రంగారెడ్డి, గొల్లపల్లి నాగయ్య, పాలడుగు భాస్కర్, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొననున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలపై ధరలతో భారం మోపుతూ దేశ సంపదను టాటా, బిర్లా, అదానీలకు కట్ట బెడుతూ ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. ఈ సమావేశంలో సూడి కృష్ణారెడ్డి, దబ్బకట్ల లక్ష్మయ్య, కొప్పుల రఘుపతి, బచ్చలి కృష్ణబాబు ఉన్నారు.



మాట్లాడుతున్న మచ్చ వెంకటేశ్వర్లు

బాధిత కుటుంబాలకు భరోసా



ములుగు రూరల్: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే



వెంకటాపురం(ఎం): పరామర్శిస్తున్న తస్లీమా



తిమ్మాపూర్‌లో బియ్యం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్(గోవిందరావుపేట): గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన పైడాకుల అక్షయ్‌కుమార్ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సీతక్క గురువారం పరామర్శించారు. అలాగే ఈతకు వెళ్లి మృతి చెందిన విద్యార్థి అక్షయ్ కుమార్ తల్లి తండ్రులు స్వప్న–మహేష్‌లను సీతక్క ఓదార్చారు. ఆమె వెంట టీపీసీసీ కార్యదర్శి పైడాకుల అశోక్, బానోత్ రవిచందర్, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, ఆకుతోట చంద్రమౌళి, నల్లెల్ల భరత్, బండి శ్రీనివాస్, అహ్మద్‌పాషా తదితరులు ఉన్నారు.

వెంకటాపురం(ఎం): మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి రాకేష్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ పరామర్శించి సర్వర్ చారిటబుల్ ట్రస్టు–ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం అందించి సహృదయాన్ని చాటుకున్నారు. తస్లీమా వెంట ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

తిమ్మాపూర్‌లో..

మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి రాకేష్ ఇటీవల గుండెవ్యాధి సమస్యతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల విజయ్ కుమార్ రెడ్డి పరామర్శించి 25 కేజీల బియ్యంతో పాటు 5 కేజీల నూనె, ఆర్థిక సాయం అందజేశారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేష్, మండల అధ్యక్షుడు గంగుల రాజ్‌కుమార్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి గుడేపు సంతోష్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు బెల్లంకొండ వినోద్, ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి గంప సునీల్, తిమ్మాపూర్ బూత్ కమిటీ అధ్యక్షులు రాజు, నాయకులు మిడిదొడ్డి శంకర్, రాజు, సారయ్య పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌కు సన్మానం

పలిమెల: కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన పలిమెల మండల కేంద్రానికి చెందిన పెద్దింటి మల్లయ్యను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి, మండల అధికార ప్రతినిధి వేములవాడ రాజబాపులు గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. మండల రైతుల సమస్యలపై చర్చించి రైతులకు మేలు జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ తనకు ఈ పదవీ రావడానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



మల్లయ్యను సన్మానిస్తున్న నాయకులు